క్లుప్తంగా

'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్'పై శిక్షణ



బాల్కొండ: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం బాల్కొండ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్' (యస్‌హెచ్‌వీఆర్)పై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, చెట్లు నాటడం, కిచెన్ గార్డెన్, నీటి సంరక్షణ, హ్యాండ్‌వాష్ అంశాలను తప్పకుండా పాటించాలన్నారు. ఈరేటింగ్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ పర్సన్స్ పద్మ, శంకర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళి



వేల్పూర్: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని రామన్నపేట్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో మహనీయులు మహాత్మాజ్యోతీబాపూలే, బీఆర్. అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ప్రపంచాన్ని మార్చగల శక్తి చదువుకు మాత్రమే ఉందని మహనీయులు చాటి చెప్పారని పేర్కొన్నారు. సంఘం నాయకులు బి.టి.గంగారాం, నడ్పి సాయన్న,నర్సయ్య, బాబూరావు, సుమన్, బన్ని పాల్గొన్నారు.

సిద్ధులగుట్టలో భక్తుల పూజలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు రామాలయం, అయ్యప్ప ఆలయం, దుర్గామాత, హనుమాన్ ఆలయను సందర్శించి పూజలు చేపట్టారు. అనంతరం నందీశ్వర మహరాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు కార్యక్రమంలో సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, కొంత మంజుల, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, సిద్ధుల గుట్ట సేవ సమితి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం రోడ్డు పనులు చేపట్టాలి



వర్ని (చందూర్): చందూరు మండల కేంద్రం నుంచి గ్రామ శివారులో ఉన్న నిజాంసాగర్ కెనాల్ వరకు ఆర్ అండ్‌బీ డిపార్ట్‌మెంట్ నిబంధనల ప్రకారం రోడ్డు పనులు చేపట్టాలని చందూర్ గ్రామస్తులు సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. చందూర్ బస్టాండు నుంచి గ్రామ శివారు వరకు నిబంధనల ప్రకారం 66 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. స్థానిక నాయకుల వారి అనుచరుల ప్రలోభాలకు లొంగకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కొందరి ప్రలోభాలకు లొంగి 33 ఫీట్ల వరకే రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేయాలి



రుద్రూర్: ఓటరు జాబితాలో ఉన్న తప్పులను అధికారులు వెంటనే సరి చేయాలని కోటగిరి మండల బీజేపీ అధ్యక్షుడు ఏముల నవీన్ కోరారు. ఈ మేరకు కోటగిరి జాబితాలో తప్పులున్న లిస్టును సోమవారం తహసీల్దార్ గంగాధర్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోటగిరికి చెందిన ఒక వ్యక్తిని ట్రాన్స్ జెండర్ గా ఓటర్ లిస్టులో ముద్రించాలన్నారు. బాన్సువాడకు చెందిన పోచారం సురేందర్ రెడ్డి మండలంలో నివాసం లేకపోయినా ఓటు ఎలా వచ్చిందని అధికారులను ప్రశ్నించారు. విచారణ జరిపి ఆయన ఓటును జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితానుంచి తొలగించాలని కోరారు. బీజేపీ నాయకులు హవగిరిరావు దేశాయ్, మామిడి శ్రీనివాస్, వడ్ల శ్యామ్ తదితరులున్నారు.

మక్క కోతలు ప్రారంభం

బాల్కొండ : ఖరీఫ్‌లో సాగు చేసిన మక్క పంట చేతికందడంతో రైతులు కోతలను ప్రారంభించారు. మక్క పంటను మే చివరి వారం నుంచి విత్తడం ప్రారంభిస్తారు. మక్క పంట 100 నుంచి 120 రోజుల్లో చేతికొస్తుంది. ప్రస్తుత సంవత్సరం మే లో వర్షాలు కురవడంతో రైతులు ముందస్తుగానే మక్క పంటను సాగు చేశారు. దీంతో ముందస్తుగా నే పంట చేతికొచ్చింది. మరో వారం రోజుల్లో మక్క కోతలు జోరందుకుంటాయని రైతులు అంటున్నారు.

ముందుగా సీడ్ మక్కలే..

ఈఏడాది ముందస్తుగా సీడ్ మక్కలే కోతకు వచ్చాయి. ఎకరాలకు గుత్తాగా మక్క పంటను సాగు చేసేందుకు ఓ కంపెనీ యజమానులు విత్తనాలను సరఫరా చేశారు. రైతులు పసుపులో అంతర్ పంటగా ఎక్కువగా ఆ సీడ్ మక్కలనే సాగు చేయడంతో అవి కోతకు వచ్చాయి. ఎకరానికి గుత్తాగా రూ.90 వేలను కంపెనీ చెల్లిస్తుంది. సాగు చేసే సమయంలోనే కంపెనీతో రైతులు ఒప్పందం చేసుకుంటారు. మక్క నూర్పిడి చేసే అవసరం లేకుండా కేవలం పొట్టు తీసి కంకులనే సరఫరా చేస్తారు. దీంతో రైతులకు శ్రమ కూడా తగ్గుతుంది.



బుస్సాపూర్‌లో మక్క విరుస్తున్న రైతులు

మక్క కోత పూర్తి చేశాం

మే నెలలో వర్షాలు కురవడంతో ముందస్తుగానే పంటను సాగు చేశాను. సీడ్ మక్క ముందుగానే కోతకు వచ్చింది. మూడెకరాల మక్క కోతను పూర్తి చేశాను. – గంగారెడ్డి, రైతు, బుస్సాపూర్

పడగల్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామ సమస్యలపై స్థానిక వీడీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని సోమవారం వేల్పూర్‌లో కలిసి విన్నవించారు. పడగల్ క్రాస్‌రోడ్డు నుండి బాల్కొండ వరకు రోడ్డు మరమ్మతు, శ్రీరాంపూర్ వరకు 5 కిలోమీటర్ల కంకర రోడ్డును తారురోడ్డుగా మార్చాలని, ఆదిమల్లన్న గుట్ట చుట్టూ రథం తిరగడానికి సీసీరోడ్డు మంజూరు చేయాలని, మేడే ఒర్రె వద్ద లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దాంతో ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మంజూరైన పనులుంటే వెంటనే ప్రారంభించాలని, మిగతా పనులకు వెంటనే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు. తాను కూడా సంబంధిత మంత్రులకు విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు మీసాల శ్యాంరావు, హన్మంత్‌రెడ్డి, యాల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆమోస్ పాల్గొన్నారు.



పడగల్ సమస్యలపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి విన్నవిస్తున్న వీడీసీ సభ్యులు

దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్లను పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, నాయకులు, దివ్యాంగులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

మాక్లూర్: మండలంలోని ముత్యంపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఎంపీడీవో బ్రహ్మానందం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. నిజామాబాద్‌కు చెందిన ఉమెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా శీతాకాల శిబిరంలో నిర్వహించగా, ఈకార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఏడురోజులు పాటు జరిగే శిబిరంలో గ్రామంలో పలు సేవాకార్యక్రమాలతో పాటు మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పోగ్రాం కో ఆర్డినేటర్ తెలిపారు. తొలిరోజు ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. హెచ్ఎం భారతిరెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మానందం

ఉత్తమ క్రీడాకారులకు అభినందనలు

నిజామాబాద్‌నాగారం/జక్రాన్‌పల్లి: జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను డీఈవో అశోక్ అభినందించారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయుల వార్షిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల మధ్య వ్యత్యాసం లేకుండా క్రీడాపోటీలను నియమ నిబంధనలతో నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జాతీయ, రాష్ట్రస్థాయి పతకాలను సాధించిన క్రీడాకారులను సన్మానించారు. డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, గోపిరెడ్డి శ్రీనివాస్, నాంచారి శ్రీనివాస్, కృష్ణంరాజు, రాజు, భారతి, ఇందిరా, నీరజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ధర్నా

రెంజల్(బోధన్): వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ముందు వారు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందించాలని కోరారు. మండలంలో సోయా, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సోయాకు రూ. 70 వేలు, వరికి రూ. 50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకునే సమయంలో పంట బీమా కోసం ప్రీ మియం చెల్లించినా బీమా వర్తించదని బ్యాంకర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బీమా సౌకర్యం కల్పించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. 70 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని వివరించారు. రాష్ట్ర నాయకుడు పుట్టి నా గన్న, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్, జిల్లా, మండల ప్రతినిధులు నసీర్, ఒడ్డెన్న, పెద్దులు, బబ్బార్, పోశెట్టి, మక్కన్న, సాయిలు, గంగాధర్, సుదర్శన్‌గౌడ్, శివాజీ, తరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిప్రతం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి



రుద్రూర్‌లో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



బోధన్‌లో..

రుద్రూర్/బోధన్‌టౌన్ : బోధన్ పట్టణంలో, రుద్రూర్‌తో పాటు అక్బర్‌నగర్, సులేమాన్‌నగర్‌లో మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల ద్వారా ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్తను స్మరిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. ర్యాలీ సందర్భంగా సులేమాన్‌నగర్‌లో కుల మతాలకు అతీతంగా బీఆర్ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. అక్బర్‌నగర్ ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో జ్యూస్, మంచినీరు, పాయసం అందజేశారు. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని మత గురువులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ, ఎస్సై సాయన్నను ముస్లింలలు సన్మానించారు. రజియా ముస్తఫా కమిటీ ప్రతినిధులు మోయిన్ రజా, బాకీ, మత గురువులు,గ్రామస్తులు పాల్గొన్నారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో ఖానేఖ ఏ ఖాద్రియ వ్యవస్థాపకులు ముహమ్మద్ అబ్దుల్ ఖాద్రి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి
- ఎడపల్లిలో గురుపూజోత్సవం

బోధన్: విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శని, సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి గౌరవ ప్రదమైన స్థానం ఉందని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాల్సిన కీలక బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు మత్తు పదార్థాలకు దరి చేరకుండా చూడాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోధన్ పట్టణ ప్రైవేట్ స్కూల్స్, కాలేజ్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎడపల్లిశివారులోని సరయూ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల విద్యార్థులు చదువుల్లో ప్రతిభ చాటి రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు.ఈకార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ట్ర స్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రైవేట్ స్కూల్, కాలేజ్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పట్ట ణ అధ్యక్షుడు ఎం, హరిక్రిష్ణ, ప్రతినిధులు మిద్దెల రాజు, వై.శ్రీనివాస్ రావు, కృష్ణమోహన్, చక్రవర్తి, దిగంబర్‌రావు, చౌడా రెడ్డి, దుష్యంత్, రమణారెడ్డి,జీపీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న బోధన్ పట్టణ ప్రైవేట్ స్కూల్, కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు



ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


విద్యార్థులు ఇష్టంతో చదవాలి



రాంమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల హెచ్‌ఎం సిరిల్‌రావు

ఆర్మూర్‌టౌన్: ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఇష్టంగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని పాఠశాల హెచ్‌ఎం ఎడ్ల సిరిల్‌రావు అన్నారు. అర్మూర్ రాంమందిర్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువతో సత్కారించి జ్ఞాపికను అందజేశారు.ఉపాధ్యాయులు గంగాధర్, పద్మ, మనోహర్, చంద్రకాంత్, రాజమణి, చిన్నయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 2వ వార్డులో వడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తుమ్ముల లక్ష్మణ్, ఖాందేష్ సత్యం, సాయినాథ్, నరేష్, లక్ష్మీ పాల్గొన్నారు.

మాక్లూర్‌లో మండల స్థాయి ఉపాధ్యాయులకు సన్మానం



మాక్లూర్‌లో ప్రశంసపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు

మాక్లూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గడ్డం నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం జరిగింది. ఎంఈవో సత్యనారాయణ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక చేసి సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో బ్రహ్మానందం, తహసీల్దార్ శేఖర్ హాజరై జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 18మంది ఉపాధ్యాయులను సన్మానించి, ప్రశంసాపత్రం, మెమెంటో అందించారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు యా ట ప్రతాప్, పి సురేష్‌బాబు, జమీలుల్లా, అశోక్, జి దేవన్న, పి రామకృష్ణరెడ్డి, రమణచారి, జి సంజీవ్, శంకర్, వెంకటరమణచారి, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్ని/నవీపేట: వర్ని మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 10మందిని మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. నవీపేట బాలుర హైస్కూల్‌లో 25 మంది టీచర్లను ఎంఈవో అశోక్ సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, ఎంఈవో సాయిలు, తహసిల్దార్ సాయిలు, ఎంపీవో మారుతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ..

బోధన్: ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి శాఖ అధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణ కేంద్రంలోని విజయ సాయి హైస్కూల్‌లో ప్రభుత్వ తాజా విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ జీఎంటీ , లయన్స్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు పోలవరపు బసవేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ మోహన్, జోన్ చైర్మన్ కరుటూరి సత్యనారాయణ, పోగ్రాం చైర్మన్, కో–చైర్మన్‌లు వీవీ సుబ్బారావు, శ్రీనివాస రాజు, సభ్యులు కెవీ సత్యం, బలరాం రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సురేష్, రాజశేఖర్, లక్ష్మా రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఐఆర్ చక్రవర్తి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కొడిచర్లలో టీచర్లకు...



కొడిచర్లలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రుద్రూర్: పొతంగల్ మండలం కొడిచర్ల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం సుగుణాకర్ రెడ్డిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో 2006–07 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు పాఠశాలకు వచ్చి గతంలో ఇదే పాఠశాలలో తమకు విద్యా బుద్ధులు నేర్పించిన సుగుణాకర్ రెడ్డిని కలిసి సన్మానం చేశారు. అనంతరం స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న టీచర్లను సన్మానించారు.

వేల్పూర్ ఎమ్మార్సీలో..

వేల్పూర్: వేల్పూర్ మండల విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాధికారి రేణుక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని 15 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఎంఈవో శాలువాతో సన్మానించి, ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ హెచ్‌ఎంగా ఎంపికైన సురేశ్ కుమార్‌కు ..

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా డొంకేశ్వర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న టి. సురేశ్ కుమార్ ఎంపికైయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ సోమవారం ఆయన పేరును ప్రకటించింది. డొంకేశ్వర్‌లో ప్రతీ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు విశేష కృషి చేస్తున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ట్రిపుల్ సీట్లు సాధిస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు హెచ్‌ఎం సురేశ్ కుమార్ కృషి కూడా ఎంతో ఉంది. ఈ సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేయగా, పాఠశాల ఉపాధ్యాయుల నుంచి సన్మానం పొందారు.



హెచ్‌ఎం సురేశ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉమ్మడి బాల్కొండ మండలంలో..

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ప్రశాంత్, ఓడ్నాల శ్రీనివాస్,(జెడ్పీహెచ్ఎస్ బాల్కొండ), శ్రీనివాస్‌రాజ్(మోడల్ పాఠశాల బాల్కొండ), శృతిమ (ఎంపీపీఎస్ శ్రీరాంపూర్)లు ఉన్నారు. వారిని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఓటరు ముసాయిదాపై నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్

వేల్పూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలకిషన్ మండల రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 6న జారీచేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ముసాయిదా ఓటర్ల జాబితా, ఫైనల్ పోలింగ్ కేంద్రాల వివరాలపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరించడానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై ఎన్నికలకు సంబంధించిన సందేహాలను ఎంపీడీవోతో నివృత్తి చేసుకున్నారు. అలాగే మాక్లూర్‌లో ఎంపీడీవో బ్రహ్మానందం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

బాల్కొండ: హైదరాబాద్‌లో ఈ నెల 21 నిర్వహించే ఎక్స్‌పో–2025 కు చెందిన వాల్‌పోస్టర్లను సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో ఫోటో గ్రాఫర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫోటో గ్రాఫర్ల కోసం వర్క్‌షాపులు, సాంకేతిక సెషన్‌లు, ప్రత్యేక డెమోలను ఎక్స్‌పోలో నిర్వహించబడుతాయన్నారు.ఎక్స్‌పోలో ప్రతి ఫోటో గ్రాఫర్ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యుడు నాసిర్, మండల అధ్యక్షుడు రాజెందర్, ప్రధాన కార్యదర్శి గడ్డం హరీష్, రమేశ్, రాకేశ్, సుమన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



రుద్రూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో భారీ వర్షానికి ఇళ్లు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బాన్సువాడ నియోజక వర్గ బీజేపీ నాయకుడు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అంబేద్కర్ కాలనీలో పర్యటించి శిథిలావస్థకు చేరిన గృహాల్లో ఉంటున్న పది కుటుంబాలకు టార్పాలిన్ కవర్స్ అందజేశారు. అనంతరం ఆయన వరద బాధితులకు తక్షణ సాయం అందించాలని అధికారులను కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు పార్వతి మురళి , మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు యంవి . కృష్ణంరాజు, బేగరి వినోద్ కుమార్, నాయకులు గజేందర్ , సాయినాథ్, గణేష్, శివప్రసాద్, సాయికుమార్, వెంకటేష్ తదితరులున్నారు.

సాగురంగాన్ని పరిరక్షించుకుందాం



ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతును, భూమిని వేరు చేసే కుట్ర పన్నుతుందని, పోరాటాలతో సాగురంగాన్ని పరిరక్షించుకుందామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. పట్టణంలోని సైదాబాద్ కాలనీలో గల షాదిఖానాలో సుంకాలు–వ్యవసాయ రంగంపై ప్రభావం, సహకార వ్యవస్థ పునర్జీవం' అనే అంశంపై రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .కార్పొరేటర్లకు సాగుభూములు అప్పజెప్పే కుట్ర జరుగుతుందన్నారు. పత్తి పంట చేతికి వచ్చే దశలో దిగుమతి పన్ను రద్దు చేయడం సరికాదన్నారు. రైతులను, వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రమేశాబాబు, పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్‌లో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిధుల మంజూరు పత్రాలను ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిసెరం భూమేశ్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సుమన్‌నాయక్, తదితరులున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
9010585333
9849180084
9966958559
7993150102
9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899